"ఒక స్త్రీ, పురుషుడు స్నేహంగా ఉండాలంటే ఫిజికల్ యూనియన్ అవసరమా?" తన ఎదురుగా కూర్చున్న నా చేతిని మృదువుగా నొక్కుతూ అడిగింది మధుర.

"అంటే...?" అర్థం కానట్టు అమాయకత్వం ఒలికించి చూస్తున్నాను.


"నువ్వు అంత అమాయకంగా ఫేసు పెట్టకు. నే నడిగిం దేమిటో నీకు బాగానే అర్థమయిందని నాకు తెలుసు. కానీ, సమాధానం చెప్పాలనుంది."

గాలికి ఎగిరి పోతున్న పైటను, జుట్టును సర్దుకో లేక సతమత మవుతున్న ఆమెను చూస్తుంటే నా మనసు వశం తప్పుతోంది. "ఏమో, మధూ, నా కంటూ ఒక స్నేహితు రెవరూ లేరు, నువ్వు తప్పితే. నీకోసమైనా నీ అంటావు నువ్వు 'మాట్లాడట' కానీ, నేను సాధారణంగా ఆడవాళ్ళతో మాట్లాడను. దేనికీ మాట్లాడలేను. ఆ సంగతి నీకు బాగా తెలుసు. నువ్వడిగిన ప్రశ్నకి సమాధానం నేను చెప్పలేను. ఇంక మనిద్దరి విషయంలో ఫిజికల్ యూనియన్ అవసరమా, అనవసరమా అన్నది నీ ఇష్టం మీద ఆధారపడి ఉంటుంది." ఆమె ముఖ కదలికలను గమనిస్తూ అన్నా న్నేను. "ఇందాకా నేనేమైనా తొందరపడి ఉంటే...ఐయామ్ సారీ."

"ఫర్‌గెట్ ఇట్, మధూ. మొదటినుంచీ నిన్ను ఎంకరేజ్ చేసింది నేను. చివరికి ఇక్కడికి వద్దామని సజెస్ట్ చేసిందికూడా నేనే. ఎంతైనా మగాడివి—ఆ మాత్రం ఇనీషియేటివ్ తీసుకోవడం తప్పేమీ కాదు. సరే, నే నడిగిన దానికి నేనే సమాధానం చెప్పనా?" నవ్వుతున్న ఆమె మొహంలో ఏదో వెలితి.

"చెప్పు, చెప్పు. ప్రేమించి పెళ్ళి చేసుకున్న నువ్వు నా స్నేహాన్ని కోరడమే విచిత్రమంటే, ఒక్కొక్క రోజు నువ్వు మాట్లాడే మాటలు, అడిగే ప్రశ్నలు ఇంకా చిత్రంగా ఉంటాయి."

"నిజమే, మధూ. నేను శేఖర్ని ప్రేమించే పెళ్ళా డాను, కానీ నే నతన్ని సరిగ్గా అర్థం చేసుకోలేదేమో



# నో సీన్

## కె. విజయలక్ష్మి

అనిపిస్తుంది నాకు. 'మేరేజ్ ఈజ్ ది రిజల్ట్ ఆఫ్ మిసండర్‌స్టాండింగ్'ట. అలా అని మా ఆయన నేదో చాలా చెడ్డవాడని, నన్ను చాలా బాధలు పెడతాడని అనుకోకు మధూ. 'ఆడాళ్ళని పువ్వుల కంటె నాజూగ్గా చూసుకోవాలి' అంటాడు. అలాగే నన్ను చూసు కుంటాడుకూడా. శేఖర్ చాలా మంచివాడు. ఎంత మంచివాడంటే నే నిలా నీతో ఒంటరిగా ఈ నిర్మానుష్య ప్రదేశంలో ఉన్నానని తెలిసినా ఏమీ అనుకోనంత మంచివాడు. అలాగే నేనుకూడా తను ఏ స్త్రీతో ఎక్కడికి వెళ్ళినా, ఎలా ప్రవర్తించినా




విశాల హృదయంతో అర్థం చేసుకోవాలంటాడు. ఎప్పుడూ ప్రేమ ఇద్దరిమధ్యే అయితే బోర్ కొట్టేస్తుందిట. లైఫ్ లో థ్రిల్ పోతుందిట. అప్పుడప్పుడు 'ఛేంజి' ఉండాలిట. కనీసం పాతిక మందినైనా ప్రేమించగల హృదయంతో ఒక్కరినే ప్రేమించటం మహా పాపంట. ఇవన్నీ తన ఒక్కడికే పరిమితం కాదు. నేనుకూడా నాకు నచ్చిన రీతిలో స్వేచ్ఛగా ఉండొచ్చు. మరి, ఇది పాపం కాదా అంటే తనే మంటారో తెలుసా, మధూ?" ఆమె ఉరికి నా కళ్ళలోకి చూస్తూ అడిగింది.

నా సమాధానం కోసం చూడకుండా మళ్ళీ తనే అంది: "బిట్వీన్ స్కిన్ అండ్ స్కిన్ దేరీజ నో సిన్." ఆమె కళ్ళల్లో బాధ స్పష్టంగా కనిపిస్తోంది. "నాకు నచ్చిన వ్యక్తి అయితే సరే, ఆయన సాన్నిహిత్యం ఈ జన్మలోనే కాదు, ఎన్ని జన్మలైనా నాకు విసుగు పుట్టదనీ ఆయనకెలా చెప్పాలి?" ఏడుపు నాపుకునేందుకామె ఎంతో ప్రయత్నిస్తోంది.

"సుజా, ప్లీజ కంట్రోల్ యువర్ సెల్ఫ్. నీ బాధేమిటో నా కిప్పుడర్థమవుతోంది. నే నేం చెయ్యాలో చెప్పు. ఏం చేస్తే నీ ఆయనలో మార్పు వస్తుందో, నే నేం చేస్తే నీకు సంతోషం కలుగుతుందో చెప్పు, సుజా." ఆమెమీద జాలితో నా మనసంతా నిండిపోయింది.

ఏడాది క్రితం మా ఆఫీసుకి ట్రాన్స్ఫరయి వచ్చింది సుజాత. ఆమెది లౌ మేరేజి అని ఆఫీసులో అనుకునేవారు. అందరితో కలివిడిగా మాట్లాడుతూ, ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ ఉండేది. రానురాను ఆమెలో చాలా మార్పు కనిపించేది. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ కనిపించేది, లేదా ఆఫీస్ వర్క్. అంతే గానీ, తనకు తానుగా మాట్లాడ్డమే మానుకుంది. 'వాళ్ళాయన సరిగ్గా చూసుకోవడం లేదేమో' అంటూ ఆఫీసులో గుసగుసలు పోయేవారంతా. మూడ్నెల్ల క్రితం అనుకుంటా "మధూ—మీరు నాతో లంచ్ తీసుకోవాలి ఈ రోజు" అంది సుజాత నా డెస్క్ దగ్గర నిలబడి. మొదట్నుంచీ ఆడవాళ్ళంటే ఏదో బెంకు నాలో. వాళ్ళతో మాట్లాడాలీ, సరదాగా ఉండాలీ అని ఉన్నా, తీరా వాళ్ళ దగ్గరికి కెళితే, నోట్లోంచి మాట వచ్చేది కాదు. సుజాత ఎప్పుడూ చాలా శ్రద్ధగా అలంకరించుకునేది. ఆ రోజు తెల్లటి చీరలో ఇంకా ఆకర్షణీయంగా ఉంది.

"అలాగేనండీ ఏంటి విశేషం?" ప్రత్యేకంగా నన్నొకడినే పిలవడంతో చాలా గర్వంగా లేచేను.

"చెప్తాగా" అంటూ తన సీటు కెళ్ళిపోయింది.

"ఈ వేళ నా పుట్టిన రోజు." స్వీటుకి ఆర్డరిస్తూ అంది.

"అవునా, మీ రీ సంగతి ముందుగా చెప్పి ఉండవలసింది, మెనీమెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే" ఏమీ ఇవ్వకుండా వూరికే విష్ చేయవలసి వచ్చినందుకు నొచ్చుకుంటూ అన్నా నేను.

"ముందుగ చెప్తే మీ రేమయినా తెస్తారని చెప్పలేదు."

"అయినా పుట్టిన రోజున కూడా ఆఫీసుకి రావాలిటండీ. ఎంచక్కా సెలవు పెట్టి, మీ ఆయనతో ఎక్కడికైనా వెళ్ళాలిగానీ."

"నేనూ అలాగే అనుకున్నానండీ కానీ మా వారికేదో అర్జెంట్ వర్క్ ఉందిట ఆఫీసులో. ఇంక ఇంట్లో నే నొక్కర్తినీ ఉండి చేసే దేముందనీ?

ఆమె అప్పుడప్పుడు నన్ను మధ్యాహ్నం లంచ్ కి, సాయంత్రం షాపింగ్ కి రమ్మనమనేది. వాళ్ళాయన నా మక్కె లెక్కడ విరగ్గొడ్తాడో నన్న భయం మనసులో పీకుతున్నా, 'ఆడదై ఉండి, ఆమే పిలుస్తున్నప్పుడు మగవాణ్ణి నేనెందుకు భయపడాలి' అని నాకు నేనే ధైర్యం చెప్పుకునే వాణ్ణి. అయితే సుజాత ఎప్పుడూ వాళ్ళ ఆయన గురించే మాట్లాడ్డం మాత్రం కొంచెం విసుగ్గా అన్పించేది. అసలామె అంతరార్థమేమిటో అర్థమయేది కాదు నాకు.

మా అమ్మ ఎప్పుడూ 'మా మధూ చాలా చక్కటి వాడు' అనేది. 'నా అందంచూసి సుజాత నే నంటే మనసుపడ్డట్టుంది. వాళ్ళాయన బాగుండడు కాబోలు మరి ప్రేమించి ఎలా పెళ్ళాడిందబ్బా' ఇలా సాగేవి నా ఆలోచనలు. ఆమె తెల్లటి మెడలో మెరిసే నల్లపూసలు, చిరు సవ్వడి చేసే కాలి మెట్టెలూ నన్నెప్పుడూ హద్దు మీర నివ్వలేదు. ఎంతో హాయిగా సిటీ వాతావరణానికి దూరంగా ఉన్న ఈ ప్రదేశంలో నన్ను నేనే మరిచిపోయేను ఈ వేళ.

ఎంత పెక్యూలియర్ ప్రాబ్లమ్! శేఖర్ చాలా బ్రాడ్ మైండెడ్‌లా ఉన్నాడు. ఈ కొద్ది రోజుల పరిచయంతోటే సుజాతంటే ఒకవిధమైన ఇష్టం ఏర్పడింది నాలో. ఆమె సుఖంగా ఉండాలి అదే నా కోరిక.—

దూరంగా కొంచెం ఎత్తుగా ఉన్న ప్రదేశంలో ఈ లోకంతో సంబంధం లేనట్లు శూన్యంలోకి చూస్తూ కూర్చుంది సుజాత.

"సుజా!"

"ఊఁ"

"ఏమిటాలోచిస్తున్నావు?"

"ఏం లేదు."

"ఇష్టంలేకపోతే చెప్పొద్దులే."

"అదేం కాదు, మధూ. నేను శేఖర్‌లా ఎందుకుండలేకపోతున్నానని."

"నువ్వు ట్రై చేసి చూశావా?"

"ఆ అది అయింది, కానీ నేను వోడిపోయాను. శేఖర్ లేకుండా ఇంకొకర్ని స్పర్శకూడా నేను భరించలేను."

"అందుకనేనా స్త్రీ, పురుష స్నేహానికి ఫిజికల్ యూనియన్ అవసరమా అని అడిగేవు?"

"అవును, నీ అభిప్రాయ మేమిటో తెలుసుకోవాలని."

"ఎందుకు?"

"మగవాళ్ళంతా శేఖర్ లాగే ఆలోచిస్తారా, లేదా అని తెలుసుకోవాలనే ఉద్దేశంతో."

"అందరూ అదే అభిప్రాయంతో ఉండరు, సుజా. ఒకవేళ ఉన్నా అది తమ ఒక్కరికే అనుకుంటారు కానీ, మీ ఆయన లాగ భార్యకికూడా స్వేచ్ఛ ఇచ్చే వాళ్ళు మాత్రం ఉండరు."

"నా కింక ఇక్కడ ఉండాలని లేదు, మధూ,

వెళ్ళిపోదాం." చీర కుచ్చిళ్ళ మట్టిని దులుపుకుంటూ అంది.

"అలాగే వెళ్ళిపోదాం. నాకు మీ ఆయన్ని కలుసుకోవాలనుంది, మీ ఇంటికి రావచ్చా."

"ఓ, యూ ఆర్ గ్రేట్ వెల్‌కమ్—నా ఫ్రెండ్స్ ఎవ్వరూ ఇంటికి రారని ఎప్పుడూ అంటాడు శేఖర్. ఎల్లుండి రాకూడదూ—ఎలాగూ సెలవేగా."

"తప్పకుండా వస్తాను."

"ఎనిమిదింటికి వచ్చెయ్యి. బ్రేక్‌ఫాస్ట్ ఇంట్లోనే."

అలాగేనని చెప్పి ఆమెని వాళ్ళింటి దగ్గిర దించి నేను నా రూముకి దారి తీశాను.

నేను వాళ్ళింటి కెళ్ళేసరికి శేఖర్ డ్రాయింగ్ కమ్ డైనింగ్ హాల్లో టిఫిన్ ప్లేట్లు సర్దుతున్నాడు. నన్ను చూడగానే "రండి, రండి, మీరు మధూ, అనుకుంటాను, గ్లాడ్ టు మీట్ యు" అంటూ రిసీవ్ చేసుకున్నాడు.

"మా సుజా స్నానం చేస్తోంది. ఆయిల్ బాత్ అంటే అర గంట అన్న మాట. మీ రింకా బాచిలరే నటగా, సుజా చెప్పింది, యూ ఆర్ లక్కీ. అన్నట్లు పదినిమిషా లయిపోయినట్లుంది. స్టౌ ఆఫ్‌చేసేయాలి. ఇప్పుడే వస్తాను." 'ఫిల్మ్ ఫేర్' నా చేతిలో పెట్టి వంటింట్లో కెళ్ళాడు. మనిషి మంచి ఒడ్డూ పొడుగూ, మంచి ఆకర్షణీయంగా ఉన్నాడు. 'అతను బాగుండడేమో' అనుకున్న నా వూహకి నేనే సిగ్గు పడ్డాను.

"హల్లో, మధూ!" టవల్‌తో తల తుడుచుకుంటూ వచ్చింది సుజాత.

"హల్లో! నువ్వు ఇంట్రడ్యూస్ చెయ్యక్కర లేకుండా మేమే పరిచయం చేసేసుకున్నాం" అన్నాను నవ్వుతూ, అప్పుడే అక్కడికి వచ్చిన శేఖర్‌ని చూస్తూ.

"చాలా మంచి పని చేశారు. నాకో పని తప్పింది. ఇంక టిఫిన్ తీసుకుందామా—మళ్ళీ చల్లారిపోతే బాగుండదు."

"అందుకనే, డార్లింగ్, నువ్వొచ్చేసరికి అన్నీ రెడీగా ఉంచాను.

"ఏంటీ, నువ్వసలేం తినడం లేదు—కూర లేదా?"

"నాకు పొద్దున్న టిఫిన్ చేసే అలవాటు లేదు, సుజా. కూరకేం—బాగుంది."

"బాగుండడ మేమిటండీ — బ్రహ్మాండంగా ఉంటేనూ! మా సుజా ఏం చేసినా అంతే ఇల్లు చూడండి ఎంత నీట్‌గా పెట్టిందో, చాలా సిస్టమేటిక్. ఇంతకీ, మా సుజాని ఎక్కడికి తీసు కెళ్ళుతున్నారు మీరు. అఫ్‌కోర్స్, బలవంత మేమీ లేదు. మీ కిష్టముంటేనే చెప్పండి." కూర వేసుకుంటూ అన్నాడు శేఖర్.

"బాగుంది నువ్వడగడం. మధు నిన్ను కలుసుకోవాలని వచ్చాడు."

"కొంప తీసి నన్ను తీసుకు వెళతారా ఏమిటి?" పెద్దగా నవ్వుతూ అడిగాడు.

"మీ సుజాతని నేను తీసుకునివెళ్ళితే, మీరేం చేస్తారు?"

"నా గురించి మీ రేం వర్రీ అవ్వక్కర్లేదు. నే



ఫోటో— ఎం. శివశంకరయ్య

నేదో ఒక ఎంటర్‌టైన్‌మెంట్ క్రియేట్ చేసుకోగలను. మా సుజాకి మాత్రం బోర్ కొట్టకుండా చూడండి! మీ రింకా అలాగే కూచుంటే ఎండెక్కిపోతూంది. నాట్ పిటీ! ఇటీజ్ దట్ నోబడీ నోస్ హౌ టు మేనేజ్ ఎ వైఫ్, బట్ ఎ బాచిలర్." సుజాత వక్క తిరిగి కన్ను కొడుతూ అన్నాడు.

సుజాత మొహం కోపంతో ఎర్రబడ్డం గమనించి నేనే అన్నాను: "చూడండి, శేఖర్, మీ కేం అభ్యంతరం లేకపోతే, నా కివాళ . . . మీ ఇంట్లో భోజనం చెయ్యాల నుంది. రోజూ హోటల్ మెతుకులు తిని విసుగెత్తి పోతూంది."

"అసలు నేనే ఉండమందామనుకున్నాను. నీ కేంటి ఇష్టమో చెప్పు, చేస్తాను." నాతో ఎక్కడ వెళ్ళవలసి వస్తుందోనని భయపడుతున్న ఆమె కీ విషయం ఎంతో సంతోషం కలిగించి నట్లుంది.

"అన్ని రకాలు చేసేయ్—కొత్తిమీరి కారం మాత్రం మరిచిపోకు. ఇంతలో మేం ఒక షో వేస్తాం" అన్నాడు శేఖర్ జేబులో ఉన్న కార్డ్స్ బయటకు తీస్తూ.

"నాతో కొంచెం మాట్లాడాలి, శేఖర్" అన్నాను సుజాత టిఫిన్ ప్లేట్లు తీసుకుని లోపలికి వెళ్ళగానే.

"నాతోనా."

"అవును."

"సరే, పదండయితే అలా మార్కెట్ దాకా వెళ్దాం. సుజా, కొంచెం తలుపేసుకుంటావా— సిగరెట్లు అయిపోయేయి, తెచ్చుకుంటాను" అంటూ బయటికి నడిచేడు.

"ఇప్పుడు చెప్పండి."

"సుజాతకి నేను మీ రనుకుంటున్న లాంటి స్నేహితుణ్ణి కాను."

చురుగ్గా తలెత్తి నా కళ్ళల్లోకి చూసేడు.

"నిజం, శేఖర్. నేను కేవలం స్నేహితుడినే. నాతోనే కాదు, ఆమె ఇంకెవరితోనైనా సరే, ఒక్క స్నేహితుడుగానే ట్రీట్ చెయ్యగలదు కానీ, మీ లాగ 'బిట్వీన్ స్కిన్ అండ్ స్కిన్ దేర్ నో సిన్' అని అనుకోలేకపోతూంది. మిమ్మల్ని ఎంతో ఇష్టపడి వివాహం చేసుకుంది, అలాంటి మీరే 'నువ్వెవరితోనైనా స్వేచ్ఛగా ఉండొచ్చు' అనడం ఆమె భరించలేకుండా ఉంది. నేను మిమ్మల్ని మారిపొమ్మని, మీ సరదాలూ అవీ మానుకోమని చెప్పబోవటం లేదు. ఎందుకంటే, ఒకసారి ఇలాంటి వాటికి అలవాటు పడ్డ తర్వాత మానుకోవడం చాలా కష్టం. కాబట్టి మీరు ఆమెను 'నీ ఇష్టమొచ్చినట్లు ఉండొచ్చు' అని చెప్పడం మానేసి మీ ఇష్టాలతో తన ఇష్టాలు ముడివేసుకున్న ఆమెను 'ఇలా అయితే నా కిష్టం' అని ఆమెను సుఖపెట్టండి. అంతేకాదు, మీరు ఎవరితో, ఎక్కడికి వెళ్ళినా, ఏం చేసినా ఆమెకు చెప్పకండి. దయచేసి 'ఆమెతోటిదే మీ లోకం' అన్న భావాన్ని ఆమెకు కలగనివ్వండి. మీ రామెకు స్వేచ్ఛ నిచ్చి చాలా గొప్పగా అనుకుంటున్నారేమో గానీ, ఆమె మాత్రం ఈ స్వేచ్ఛను కావాలనుకోవడం లేదు. తను కూడా మీలాగే ఉండాలనే ఉద్దేశంతోనే నా స్నేహాన్ని కోరింది. కానీ ఓడిపోయింది. మీ సాహచర్యంలో పొందే సుఖాన్ని ఆమె ఇంకెక్కడా పొందలేదు. ఇకనైనా మీ అభ్యుదయ భావాన్ని మరిచిపోయి, మీ అధికారాన్ని చూపించండి 'నువ్వు నా కోసమే' అంటూ ఆంక్షలు పెట్టండి. అదే ఏ భార్యయినా కోరుకునేది

"సుజా నన్నింతగా ప్రేమిస్తోందా? నేను కూడా అంత చెడ్డవాణ్ణి కాదండి. నేను నా స్నేహితులతో ఎంజాయ్ చేస్తున్నప్పుడు తను లోన్లీగా ఫీలవకూడదన్న ఉద్దేశంతో అలా అనేవాణ్ణి కానీ, సుజా ఇలా 'నెగ్లెక్టెడ్'గా ఫీలవుతుందని అనుకోలేదు. కానీ సుజా ఎప్పుడు కూడా నేనెలాగంటే అలాగే అనేది కానీ, తన అభిప్రాయం ఇదీ అని గానీ, తనకు నా కంపెనీయే ఎక్కువ ఇష్టమనిగానీ చెప్పేదికాదు. పెద్దాంతో నేను కూడా తన కివన్నీ ఇష్టమే అనుకునేవాన్ని."

"సుజాత చాలా సెన్సిటివ్ — మీరే అన్నీ మీ కుగా తెలుసుకోవాలి అనుకుంది తప్పితే తనకు తానుగా చెప్పలేకపోయింది."

"చాలా థాంక్స్, మధూ. ఇప్పటిక్కానా నా సుజా అంటే ఏమిటో మీ నుంచి తెలుసుకోగలిగేను. 'ఏం కట్టుకోను' అని అడిగితే కూడా 'నీ ఇష్టమొచ్చింది' అనేవాణ్ణి కానీ, నా ఇష్టమే ఆమె ఇష్టమని తెలుసుకోలేకపోయేను. నేను తప్పనిసరిగా అటెండ్ అవాల్సిన పార్టీ లవీ ఉన్నప్పుడు మాత్రం మీరు మా సుజాకి కంపెనీ ఇవ్వాలి. మీ అంత మంచి స్నేహితుణ్ణి పొందిన ఆమె నిజంగా అదృష్టవంతురాలు."

"నే నేమంత గొప్పవాణ్ణి కాదు గానీ, పదండి ఇంటికి. ఇప్పటికే లేటయిపోయింది. సుజాత మన కోసం ఎదురుచూస్తూ ఉంటుంది" అన్నాను లేవడానికి ప్రయత్నిస్తూ. ★